ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసు ఏసీ బస్‌షెల్టర్

ఏసీలు లేకుండా ఉన్న బేగంపేట్‌లోని బస్టాప్

అధ్వానంగా ఏసీ బస్ షెల్టర్లు

విలువైన పరికరాలు దొంగల పాలు.. పట్టించుకోని అధికారులు



ఖైరతాబాద్, మార్చి 6 : దేశంలోనే తొలి సారిగా నగరంలో ఏసీ బస్ షెల్టర్లను 2018లో అప్పటి ప్రభుత్వం ప్రయాణికుల కోసం అందుబాటులోకి తెచ్చింది. సోమాజి గూడలోని ఖైరతాబాద్ ఆర్టీఏ బస్టాప్, కూకట్‌పల్లి, శిల్పారామం, బేగంపేట్‌లో ఏర్పాటు చేశారు. రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ బస్ షెల్టర్ల ఆధునిక హంగులతో నిర్మించారు. ప్రస్తుతం అవి అధ్వానంగా మారాయి. నిర్వహణ లేక చెత్తచెదారం పేరుకుపోయి లక్షలాది రూపాయల విలువై పరికరాలు దొంగలపాలైనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ప్రయాణికులు వేచి ఉండాల్సిన చోట ప్రైవేట్ జిరాక్స్ సెంటర్లు వెలిశాయి. దీంతో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

పరికరాలు మాయమైనా పట్టింపు లేదు

ఖైరతాబాద్ ఆర్టీఏ ఏసీ బస్‌షెల్టర్‌లో విలువైన పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్తుంటే సంబంధిత జీహెచ్ ఎంసీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్ షెల్టర్ ఆధ్వానంగా మారి పరికరాలు దొంగల పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏసీ బస్‌షెల్టర్లకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పారిశ్రామిక వాడ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

కాప్రా, మార్చి 6 చర్లపల్లి పారిశ్రామికవాడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, సిఐఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వస్తు ఉత్పత్తుల ప్రదర్శన ఈ ఎక్స్ పో ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన పారిశ్రామికవాడ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అవసరమైతే సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ పరిశ్రమలు ఉత్పత్తి చేసిన యంత్రాలు, వస్తువులు, ఇతర ఉత్పత్తులు ప్రదర్శించగా వాటిని ఎమ్మెల్యే తిలకించి ఉత్పత్తిదారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టిఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ రెడ్డి, సిఐఏ అధ్యక్షులు గోవిందరెడ్డి, చైర్మన్ రోశి రెడ్డి, చంద్రశేఖర్ వెంకటరమణ, మోహన్, మూర్తి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

నార్మ్‌తో అవగాహన ఒప్పందం అభినందనీయం

వీసీ అల్ధాస్‌జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 6ః మానవ వసరుల అభివృద్ధి కేంద్రానికి సాంకేతిక సహకారం అందించడానికి భారత వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్‌తో అవగాహణ ఒప్పందం కుర్చుకోవడం అభినందనీయమని రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. అల్ధాస్ జానయ్య అన్నారు. గురువారం నార్మ్ సంస్థ డైరెక్టర్ డా. ఆర్‌సీ అగర్వాల్, పిజెటిఎయు రిజిస్ట్రార్ డా. విద్యాసాగర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, డా. బలరాం, జాన్సీరాణి , డా.రాములు, నార్మ్ అధికారులు పాల్గొన్నారు.

రూ.7.2 కోట్లతో వృక్షాల తరలింపు

ట్రాన్స్ లోకేట్ చేయనున్న హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, మార్చి 6(నమస్తే తెలంగాణ) : నగరంలో 4230 మహా వృక్షాలను తరలించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. హెచ్ఎండీఏ చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల కోసం రోడ్లకు ఇరువైపులా వృక్షాలను తరలించి ఇతర ప్రాంతాల్లో నాటనున్నారు. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు నిర్మించుకున్న ఈ మొత్తం 18.2 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్లతో రోడ్లను విస్తరించనున్నారు.

స్పెషల్ డ్రైవ్ లో సిల్ట్ కార్టింగ్ వాహనాలదే కీలక పాత్ర

వాహనాల యజమానులతో జలమండలి ఎండీ భేటీ

సిటీబ్యూరో, మార్చి 6, (నమస్తే తెలంగాణ): స్పెషల్ డ్రైవ్ లో సిల్ట్ కార్టింగ్ వాహనాలదే కీలక పాత్ర అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిల్ట్ కార్టింగ్ వాహన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఏ సమయంలో ఫోన్ చేసినా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం వాహనాల యజమానులు పలు సమస్యలను ఎండీకి తెలుపగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ అమరేందర్ రెడ్డి, వాహనాల యజమానులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎంఎల్సీ ఓటమి రేవంత్ రెడ్డి పాలనకు రిఫరెండం

రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి

ఎల్బీనగర్: గ్రాడ్యుయేట్లు ఇచ్చిన రెఫరెండాన్ని శిరసావహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం యువతకు ఏడాదిలో 50 వేల ఉద్యోగాలు ఇస్తేనే ఓటు వేయమని అడిగారని, కానీ అదంతా పచ్చి అబద్ధమని గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్ ను ఛీకొట్టారన్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలే ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేశారన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు నిక్కచ్చిగా తీర్పు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించారన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తమ అసమర్థతను ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఆధార్ లేదని శ్రీవిద్య చదువుకు అడ్డంకి!

చిన్నారి చదువుకు అనుమతివ్వాలని జడ్జి ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : పుట్టిన దృవ పత్రం, ఆధార్ కార్డు లేదని ఎస్ఆర్.నగర్‌లోని శ్రీవిద్యాంజలి ప్రైవేటు పాఠశాలలో చదువుకునేందుకు మల్లేల శ్రీవిద్యకు అడ్డంకిగా మారింది. పత్రాలు పొందేందుకు డబ్బులు లేక పేదరికంతో మగ్గుతున్న శ్రీవిద్య కుటుంబానికి న్యాయసేవాధికార సంస్థ అండగా నిలిచింది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరీ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్ పాషా విద్యాధికారి రోహిణి సమక్షంలో గురువారం శ్రీవిద్య ఇంటికెళ్లి సమస్య గురించి ఆరా తీశారు. పాఠశాలలో మొదటి తరగతిలో చేర్చుకునేందుకు దృవపత్రాలు కావాలని ప్రిన్సిపాల్ నిరాకరించారని, ఆధార్ కార్డు కూడా లేదని ప్రిన్సిపాల్ పాఠశాలకు రానివ్వడంలేదని చిన్నారి తల్లి దండ్రులు జడ్జికి తెలిపారు. తక్షణం చిన్నారి చదువుకు అనుమతివ్వాలని విద్యాధికారిని జడ్జి ఆదేశించారు. చిన్నారి చదువుకు అనుమతివ్వాలని ప్రిన్సిపాల్‌ను కార్యదర్శి కోరారు. విద్యాధికారి రోహిణి, డా.శాంతా రాథోడ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, విజయ భాస్కర్ ప్రొటెక్షన్ ఆఫీసర్, సురేష్ పీఎల్‌వి, ప్రిన్సిపాల్ ఉన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా భరత్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

బీసీలకు రాజకీయ స్వాతంత్రం బీసీ బల్లుతోనే సాధ్యం

సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి.ఆర్. కృష్ణయ్య

రవీంద్రభారతి, మార్చి 6 ః ఓబీసీలకు రాజకీయ స్వాతంత్రం పార్లమెంట్‌లో బీసి బిల్లుతోనే సాధ్యమని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు కోసం ఉద్యమ కార్యకరణను గల్లీ నుండి ఢిల్లీ వరకు పటిష్టం చేసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. త్వరలో నియోజకవర్గాల పునరు విభజన జరుగుతున్న నేపథ్యంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలంటే దేశ వ్యాప్తంగా కులగణన జరగాన్నారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి నియామకం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపి ఆర్.కృష్ణయ్య విచ్చేసి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్‌కుమార్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నీలవెంకటేశ్, సి.రాజేందర్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

సిటీ బ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఆర్సీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ జంక్షన్‌లో 1500 ఎంఎం పీఎస్‌సీ ఫేజ్-2 పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున శుక్రవారం, శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషన్ తెలిపారు. పటాన్‌చెరు నుంచి చందానగర్ వచ్చే వాహనాలను బీహెచ్ఈఎల్ కొత్త ఫ్లైఓవర్‌కు మళ్లిస్తామని చెప్పారు. పటాన్‌చెరు నుంచి లింగంపల్లి-నల్లగండ్లకు వెళ్లే వాహనాలను సర్వీస్ రోడ్డు ద్వారా బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ రైట్ టర్న్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ అండర్ పాస్ మీదుగా పంపించనున్నట్లు తెలిపారు. లింగంపల్లి నుంచి చందానగర్ వెళ్లే వాహనాలను బీహెచ్ఈఎల్ సర్కిల్ నుంచి జహీరాబాద్ బస్టాప్ మీదుగా అశోక్‌నగర్ యూటర్న్ ద్వారా బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ మీదుగా మళ్లించనున్నట్లు వెల్లడించారు. అమీన్‌పూర్ నుంచి చందానగర్ వెళ్లేవి శ్రీదేవి టాకీస్ రైట్ టర్న్ నుంచి బీహెచ్ఈఎల్ ఎక్స్ రోడ్ నుంచి వెళ్లాలని అన్నారు.

పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

మంత్రి శ్రీధర్ బాబు

భవనాల సముదాయానికి గురువారం భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

బడంగ్ పేట్, మార్చి 6: రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్టం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ లో పోలీసు శాఖకు చెందిన వివిధ పోలీస్ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు నూతన భవన నిర్మాణ స్థల కేటాయింపులో వివిధ భవనాల నిర్మాణ సముదాయానికి శంకుస్థాపన భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి,టి యు ఎఫ్ డి సి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ప్రోటోకాల్ రగడ

కార్పొరేటర్లు, ఎమ్మెల్యేను ఆహ్వానించకుండా అభివృద్ధి పనులు

అంబర్‌పేట, మార్చి 6ః అంబర్‌పేట నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభంలో ప్రోటోకాల్ రగడ నెలకొంది. నియోజకవర్గంలోని మూడు డివిజన్లు బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడలలో మంత్రి సుమారు మూడు కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ పనుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బి.పద్మవెంకటరెడ్డి, అమృత, కన్నె ఉమా రమేష్‌యాదవ్‌లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఈ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇది వివాదస్పందంగా మారింది. తమకు ఆహ్వానం లేకుండా అభివృద్ధి పనులు ఎలా ప్రారంభిస్తారని ఆయా డివిజన్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లకుంట కార్పోరేటర్ అమృత, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌లు ఏకంగా నిధులు మంజూరు చేసిన విభాగం ఎస్ఈ మల్లారెడ్డి ని కలిసి నిరసనను తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఇది దుర్మార్గమని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



టమాట సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

టమాటలో తెగుళ్లు తక్కువే..

వాతావరణ పరిస్థితులు అనుకూలం

అంతర్జాతీయ బ్రీడింగ్ సీనియర్ శాస్త్రవేత్త అసఫ్ ఐబిసీజ్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 6: ఇతర ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్ సమీపంలో గల టమాట సాగులో తెగుళ్లు తక్కువగానే ఉన్నాయని, తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, తైవాన్ దేశ అంతర్జాతీయ కూరగాయల పరిశోధనా కేంద్రం టమాట బ్రీడింగ్ సీనియర్ శాస్త్రవేత్త డా. అసఫ్ ఐబిసీజ్ అన్నారు. రాజేంద్రనగర్ సమీప వ్యవసాయ పొలాల్లో గల టమాట పంటలను పరిశీలించి రైతులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు తగు సూచనలు చేశారు. సమీపంలోని శంషాబాద్, మహేశ్వరం మండలాల్లోని పలు గ్రామాల రైతులను కలిశారు. టమాట సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే టమాటలో ఈ ప్రాంతంలో తెగుళ్లు తక్కువగానే ఉన్నాయని, తగుమెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆయన సూచించారు. తెలంగాణలో టమాట సాగు చేస్తున్న రైతులు వైరస్ తెగుళ్లు , టమాటో సూది పురుగు, ఆకుముడత తెగుళ్ల సమస్యలతో దిగుబడి నాణ్యతను కోల్పోతున్నారని కొండాల క్రుణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ అసోసియేట్ డీన్, మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య శాస్త్రవేత్తల దృష్టికి తీసుకు వచ్చారు. వాతావణ పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని హైబ్రీడ్ రకాలను రూపొందిస్తే ఎగుమతికి అవకాశాలు పెరుగుతాయన్నారు. రైతులు అధిక నీటినిచ్చే వరి, అధిక పెట్టుబడి గల పత్తి, మిర్చి కన్నా కూరగాల సాగు ఎంతో మేలని రైతులకు సూచించారు.

కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

సమగ్ర సర్వే డబ్బులు చెల్లించాలి

సర్కిల్ కార్యాలయం వద్ద ఆశ వర్కర్ల ధర్నా

మల్కాజిగిరి, మార్చి 6 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొన్న ఆశా వర్కర్లకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ఆశ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద సమగ్ర సర్వే చేసిన ఆశా వర్కర్లు , బూత్ లెవెల్ ఆఫీసర్లకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించి ఇప్పటివరకు చెల్లించకపోవడంతో వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన సమగ్ర సర్వే , కులగణలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయమని ఆదేశించారని అన్నారు. సర్వే చేసి గడువులోపుగా పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారితోషకం చెల్లించాలని ఆశా వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు బిఎల్ ఓ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త పాలసీ

బంజారాహిల్స్, మార్చి6: తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం,వైద్యం,అభివృద్ధి, వేతనాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి ఒక కొత్త పాలసీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని ఆమె చెప్పారు.ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జూబ్లీ హిల్స్‌లోని సొసైటీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రకరకాల థీమ్‌లతో జరుపుకుంటున్నారన్నారు. మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇప్పటి వరకు 36 మంది మహిళా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను సొసైటీ కేటాయించిందని, ఇంకా వందకు పైగా మహిళా జర్నలిస్టులు వెయింటింగ్ లిస్ట్‌లో ఉన్నారని సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండ భేరి గోపరాజు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవులపల్లి అమర్, ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజు, కార్యదర్శి రవీంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీ నారాయణ మసాదె, సంయుక్త కార్యదర్శి డా.చల్లా భాగ్యలక్ష్మి, కోశాధికారి భీమగాని మహేశ్వర్ గౌడ్, ఎంసీ మెంబర్ కమలాకరా చార్య, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గ్రేటర్ @ 34.4డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16.7డిగ్రీలు, గాలిలో తేమ 12శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్షకు దిగిన దివ్యాంగ పరిశోధక విద్యార్థులు

మెస్ బిల్లుల అక్రమ వసూళ్లను ఆపాలి

దివ్యాంగ పరిశోధక విద్యార్థుల నిరాహారదీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో దివ్యాంగ పరిశోధక విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని నిరాహార దీక్ష చేపట్టారు. మెస్ బిల్లుల అక్రమ వసూలను నిరసిస్తూ ఓయూ పరిపాలన భవనంలో నిరసన చేపట్టారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ తమ వద్ద నుంచి అధికారులు అక్రమంగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకోకపోతే మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.